

# అన్నపూర్ణ కావిడి

సంజెవేళ!

ఇల్లాళ్ళు పనులు ముగించుకొని, స్నానాలు చేసి, వాకిటి గడపల్లో కూర్చుని ముచ్చటలాడుకుంటున్నవేళ! సాయం సంధ్యలో స్వామి దర్శనం చేసుకుని జనం గుడినించి తిరిగి వెళ్తున్న వేళ!

వీధి చివర చిరుగంటల మోత! ఆ వెంటనే "మాతా అన్నపూర్ణేశ్వరీ" అన్న పెద్దకేక. పిల్లలంతా ఆ కేక వచ్చిన వైపు, ఆ గంటల మోత వైపు పరుగెత్తారు. శరభయ్య అన్నపూర్ణ కావిడితో ఇంటింటికీ వస్తున్నాడు. శరభయ్యా అరవయ్యేళ్ళ వృద్ధు. బవిరిగడ్డం. ఆ గడ్డం వెనకాతల నవ్వుతున్న పెదవులు, ముడతల ముఖంలో వెలుగుతున్న కళ్ళు, నుదుట మూడుపాయలుగా తెల్లని విభూతి, ఆ విభూతి చారలమధ్య సాయంసూర్యుడిలా పెద్ద కుంకం బొట్టు. చేతులకి, ఛాతీకి కర్మబంధాలు కట్టిపడేసినట్టు పెద్ద పెద్ద విభూతి పాయలు. చిరిగిపోయినా శుభ్రమైన పట్టుబట్ట కట్టాడు శరభయ్య. భుజాన అన్నపూర్ణ కావిడిని అటూ ఇటూ మారుస్తుంటే కావిడికున్న గంటలు ఘల్లుఘల్లున మోగుతున్నాయి.

ఆ యిత్తడి కావిడి నిగ నిగ మెరుస్తోంది. శుభ్రంగా తోమిన ఆ కావిడికి విభూతి,

కుంకంబొట్లు పెట్టాడు. కావిడి కిరుప్రక్కలా వేలాడుతున్న గొలుసులు, ఆ గొలుసులకు చిన్న గంగాళాల్లా గిన్నెలు. ఇంటింట ముందు ఆగి ఒక గిన్నెలో అన్నం మరో గిన్నెలో కూరలు వేయించుకుంటున్నాడు శరభయ్య. "మాతాన్న పూర్ణేశ్వరీ" అని తప్ప వేరు మాట అనడు. అదే పిలుపు. అన్నం పెట్టిన తర్వాత అదే ఆశీర్వచనం. ఆ పిలుపు విని అన్నం పెట్టని ఇల్లాలుండదు. ఏ యిల్లాలైనా వాకిట ఉంటే పక్కింటి వాళ్ళని పిలిచి అన్నం పెట్టిస్తుంది. శరభయ్యతోపాటే పిల్లలంతా ఆ వీధిదాటి వెళ్ళేదాకా ఆ అన్నపూర్ణ కావిడిని, 'మాతాన్నపూర్ణేశ్వరీ' కేకను, వూగుతూ మోగుతున్న గంటల్ని చూస్తూ వెంట నడుస్తారు. శరభయ్య వీధి దాటి వెళ్ళింతర్వాత అందరూ 'మాతాన్న పూర్ణేశ్వరీ' అని గోలగా అరుచుకుంటూ ఎవరిళ్ళకు వాళ్లు వెళ్తారు.

శరభయ్య వీధులన్నీ తిరిగి గాలిగోపురం దగ్గరికొచ్చేసరికి అక్కడికి కుంటీ, గుడ్డీ బిచ్చగాళ్ళంతా చేరుకుంటారు. తను తెచ్చిన అన్నం కూరలు వాళ్ళకు పెట్టి, మిగిలింది తను తిని, మిగలకపోతే కృష్ణాజలం తాగి 'శంభో' అనుకుంటూ పొద్దుపోయేదాకా ఏక్‌తారా మీటుకుంటూ తత్వాలు పాడుతూ నిద్రపోతాడు.

గతం తెలిసిన వాళ్ళు శరభయ్యేమిటి? ఈ అన్నపూర్ణ కావిడేవిటి? ఈ వైరాగ్యమేమిటి? అని ఆశ్చర్యపోతారు. శరభయ్య వయసులో ఉండగా, అమ్మా, నాన్నా, శాంతమ్మని చేసుకోమని చెప్తే, నల్లగావున్న శాంతమ్మని కాదని ఎర్రగావున్న కాంతమ్మని చేసుకొన్నాడు. కాంతమ్మ కాపురానికొచ్చిన ఆర్నెల్లలో అత్తమామల్ని అరుగులమీదికి తోలింది. పోనీ కట్టుకున్న మొగుణ్ణి కళ్ళలో బెట్టుకు చూసిందందామా అంటే అదీ లేదు. శరభయ్యని నుంచోనిచ్చేది కాదు. కూర్చోనిచ్చేది కాదు. తిండి సమంగా పెట్టేది కాదు. పెట్టిన తిండి తిననిచ్చేది కాదు. ఉక్కిరిబిక్కిరై పోయేవాడు శరభయ్య. రాత్రయ్యేటప్పటికి కాంతమ్మ నెమిలికంఠం చీర కట్టుకుని చేమంతిపూలు పెట్టుకుంది కదాని శరభయ్య దగ్గరకెళ్ళి నవ్వుతూ బుజం మీద చెయ్యేస్తే 'సయ్'న తాచుపిల్లల్లే లేచి 'అదొక్కటే తక్కువ మొకానికి ..... సచ్చినోడికి సరసం కూడా!' అని ఛీ కొట్టేది. అప్పట్నించీ రాత్రిళ్ళు గుళ్ళో జమ్మిచెట్టుకింద పడుకునేవాడు.

శరభయ్య తల్లీ దండ్రీ పోతే కర్మలన్నా సక్రమంగా చేయనివ్వలేదు కాంతమ్మ.

దాంతో శరభయ్యకి భార్యన్నా, బతుకన్నా విరక్తి కలిగింది. సన్యాసుల్లో కలుద్దామని ఓ అర్ధరాత్రి కాశీ పారిపోయొచ్చాడు.

అలా కాలినడకన భార్యని తిట్టుకుంటూ, బతుకుని తిట్టుకుంటూ కాశీ అయితే వచ్చాడుగాని, కాశీ వచ్చినప్పటినుంచి ధ్యాసంతా కాంతమ్మమీదే. అది నెమిలికంఠం చీర కట్టుకుందో లేదో? వాలుజడ వేసుకుందో లేదో, అంటూ పెళ్ళాం గురించే తలపులు. అటు సంసారం కుదరక, ఇటు సన్యాసుల్లో కలవలేక కొట్టుమిట్టాడుతూ ఓ బైరాగుల మఠంలో చేరాడు శరభయ్య. ఓ మఠం నుంచి ఇంకోమఠం మారుతూ కొన్నేళ్ళు గడిపాడు. కాషాయం కట్టాడుగాని, కాంతమ్మని గురించిన ఆలోచనలు తగ్గలేదు. పోనీ ఇంటికెళ్ళి కాపురం చేద్దామా అంటే ఆ ధైర్యం లేదు. కొంతకాలానికి ఓ దయగల సేఠొకడు "ఎంతకాలం ఈ బైరాగుల మఠాల్లో పడి తింటావు?" అని ఓ అన్నపూర్ణ కావిడి తన పేరన దానమిచ్చి వూరూర అడుక్కుతినమని పంపించాడు. అప్పట్నించి ఆ కావిడి భుజాన వేసుకుని వూరూరు తిరుగుతూ ఒక్కసారి కాంతమ్మని చూడాలన్న ఆత్రంతో అమరావతి పరుగెత్తుకొచ్చాడు.

శరభయ్య తిరిగొచ్చేసరికి కాంతమ్మ ఈ లోకం వదలి వెళ్ళిపోయింది. అన్నపూర్ణ కావిడే శరణ్యం అయింది. నిజమైన వైరాగ్యం అప్పుడు కుదురుకుంది శరభయ్యలో. అందరికీ పెట్టి తను తృప్తిగా పస్తులుండేవాడు. ఆఖరిదశలో శరభయ్య తత్వాలు పాడలేకపోతే సిద్ధయ్య అనే కుంటి బిచ్చగాడు సాయం పాడేవాడు. సిద్ధయ్యకు గట్టిగా ఇరవై ఏళ్ళు లేవు. శరభయ్య అవసానదశలో వుండగా సిద్ధయ్య అడిగాడు "తాతా! నువ్వు పోయిం తర్వాత నాకీ అన్నపూర్ణ కావిడివ్వవా?" అని.

ఆ మాట విని శరభయ్య నవ్వి అన్నాడు "పిచ్చోడా! అన్నపూర్ణలాంటి పెళ్ళాన్ని కోరుకోవాలిగాని అన్నపూర్ణ కావిడి కోరుకుంటావేరా? అన్నం పెట్టే ఆలిని కోరుకోవాలిగాని, అడుక్కుతినే పళ్ళెం కావాలంటావేంరా?" పాపం! నిజమే అనుకున్నాడు సిద్ధయ్య. శరభయ్య పోయాక అన్నపూర్ణ లాంటి ఆలికోసం వెతికాడు. కాని కుంటి సిద్ధయ్యకు పిల్లనెవరిస్తారు? ఆఖరికి అడుక్కుతినే పళ్ళెమే మిగిలింది.*